క్లుప్తంగా

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనం



రామాయణ అనుగ్రహ భాషణం చేస్తున్న రామసుబ్బారావు

విజయనగరం టౌన్: పట్టణంలోని రింగురోడ్డులో ఉన్న కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో బ్రహ్మశ్రీ రాళ్లపల్లి రామసుబ్బారావు శుక్రవారం సాయంత్రం చేసిన ఆధ్యాత్మిక ప్రవచనం ఆద్యంతం ఆహూతులను ఆకట్టుకుంది. మహా సామ్రాజ్య పట్టాభిషేకంలో భాగంగా ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రామసుబ్బారావు రామాయణ అనుగ్రహ భాషణం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

తొలగిన రహదారి కష్టాలు



బీసీ కాలనీలో వేసిన రోడ్డు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని 11వ వార్డులో స్థానిక కౌన్సిలర్ చిక్కాల సంతోష్‌కుమార్ చొరవతో రూ.6.5 లక్షలతో సీసీ రోడ్డును నిర్మించారు. బీసీ కాలనీ నుంచి మొయిన్ రోడ్డు వరకు రోడ్డు వేశారు. అలాగే రోడ్డుకు ఇరువైపులా కాలువలు కూడా నిర్మించారు. దీంతో ఎట్టకేలకు బీసీ కాలనీ ప్రజలకు రహదారి కష్టాలు తీరాయి. రోడ్డు వేయాలని గతంలో పలుమార్లు అధికారులు, పాలకులను కోరినా ఎవ్వరూ పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక రోడ్డు వేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రై డే



ర్యాలీలో పాల్గొన్న మత విశ్వాసులు

విజయనగరం టౌన్: గుడ్ ఫ్రై డే వేడుకలను క్రీస్తు సహోదరులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.స్థానిక కేఎల్.పురం సిటీ చర్చి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో క్రీస్తు ఆరాధకులు స్తుతి గీతాలాపన చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. పాస్టర్ రెవరెండ్ జాన్ మోజెస్ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాపులను రక్షించేందుకు దేవుడైన క్రీస్తు తన రక్తాన్ని చిందించారన్నారు. ర్యాలీ కలెక్టరేట్, ఆర్‌అండ్‌బీ జంక్షన్, మయూరి కూడలి, రైల్వేస్టేషన్, గూడ్స్‌షెడ్ మీదుగా తిరిగి కంటోన్మెంట్ చర్చి వరకు సాగింది. ర్యాలీలో వివిధ ప్రాంతాలకు చెందిన క్రీస్తు ఆరాధకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వాహన తనిఖీలు



పెదమానాపురం సంత తోట వద్ద వాహన తనిఖీలు చేస్తున్న అధికారులు

దత్తిరాజేరు : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పెదమానాపురం సంత తోట వద్ద జాతీయ రహదారి 26పై ఫ్లైయింగ్ స్క్వాడ్ అధికారి వాణిశ్రీ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు శుక్రవారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనాల్లో తరలించే ప్రతి దానికి బిల్లులు తప్పనిసరిగా ఉండాలని సూచించారు. సంబంధిత పత్రాలను చూపించాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు

రామభద్రపురం: రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని సీఐ తిరుమలరావు తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలు తీసుకోవడం వల్లే రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్లే గురువారం రాత్రి కొట్టక్కి బ్రిడ్జిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు యువకులు మరణించి, ఆయా కుటుంబాలకు తీవ్ర శోకం మిగిల్చారన్నారు. వాహనదారులంతా వాహనాలతో రోడ్డుపైకి వచ్చేటప్పుడు ఒక్కసారిగా ఇంటి వద్ద కుటుంబం ఉందని, జాగ్రత్తగా వెళ్లాలన్న ఆలోచన చేయాలన్నారు. వాహనదారులకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలన్నారు. అలాగే బైక్ నడిపేవారంతా హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి, ప్రమాదాల నివారణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

గడప గడపలో.. సంక్షేమ వెలుగులు



సచివాలయం ద్వారా సేవలు పొందుతున్న లబ్ధిదారులు (ఫైల్)

- లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలకు కోట్లాది రూపాయలు
- నియోజకవర్గంలో జోరుగా అభివృద్ధి పనులు
- అన్నివర్గాలకూ ఆర్థిక భరోసా

నెల్లిమర్ల రూరల్: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఎన్నడూ లేనివిధంగా నెల్లిమర్ల నియోజకవర్గంలో సంక్షేమ విప్లవం కొనసాగింది. 2019 సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్రమంతా ప్రజా సంకల్పయాత్ర పేరిట పాదయాత్ర చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వివిధ వర్గాల ప్రజలు పడుతున్న కష్టాలను దగ్గరుండి చూశారు. నేను విన్నాను..నేను ఉన్నాను.. అంటూ పేద ప్రజలకు భరోసా కల్పిస్తూ నవరత్నాల పథకాలను అమలు చేస్తానంటూ మేనిఫెస్టో ప్రకటించారు. మేనిఫెస్టోను ఒక బైబిల్‌గా, ఖురాన్‌గా, భగవద్గీతగా భావించిన జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత నవరత్నాల్లాంటి పథకాలు అమలు చేసి పేదల జీవితాల్లో వెలుగులు నింపారు. గతంలో జన్మభూమి కమిటీల పేరుతో నియంతపాలన కొనసాగించిన చంద్రబాబు అర్హులకు మొండిచేయి చూపారు. టీడీపీ హాయంలో సంక్షేమ పథకాలకు నియోజకవర్గంలో కనీసం రూ.50 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు సంక్షేమ పథకాల కింద సుమారు 2,950.54 కోట్ల రూపాయలు ఖర్చు చేసి పేదల అభ్యున్నతికి కృషి చేశారు.

రైతాంగంపై వాత్సల్యం..

జగనన్న పాలవెల్లు పథకం కింద 2,559 మంది లబ్ధిదారులకు రూ.19.19 కోట్లు.. రైతుభరోసాలో భాగంగా 31,478 మంది రైతులకు రూ.233.44 కోట్లను ప్రభుత్వం అందజేసింది. వైఎస్సార్ పంట నష్ట పరిహారం కింద 358 మంది లబ్ధిదారులకు రూ.1.06 కోట్లు మంజూరు చేసింది. జీవక్రాంతి పథకం ద్వారా రూ.5.84 కోట్లు.. యంత్రసేవా పథకం ద్వారా 280 మందికి రూ.1.06 కోట్ల విలువ చేసే పరికరాలు పంపిణీ చేశారు. ఉచిత పంటల బీమా కింద రూ.3.12 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.1.25 కోట్లు, సున్నావడ్డీ పంటల రుణాల కింద రూ.1.56 కోట్లు, సబ్సిడీ విత్తనాల సరఫరాకు రూ.2.19 కోట్లు, ఉద్యానశాఖ ద్వారా రూ.85 లక్షలను రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం ఖర్చు చేసింది.



కొండవెలగాడ సచివాలయం

ఆరోగ్యరంగానికి ఊపిరి..

వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద 28,570 మంది లబ్ధిదారులకు రూ.57.19 కోట్ల వైద్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందించింది. ఆరోగ్య ఆసరాకు రూ.7.16 కోట్లు ఖర్చు పెట్టింది. వైఎస్సార్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా 290 మందికి మేజర్ ఆపరేషన్లు నిర్వహించి వారి జీవితాల్లో వెలుగులు నింపారు. అన్ని పీహెచ్‌సీల్లోనూ కార్పొరేట్ తరహా వైద్య సేవలు అందిస్తున్నారు.

విద్యార్థులకు మేనమామగా..

జగనన్న అమ్మఒడి పథకం కింద 27,828 మంది విద్యార్థులకు రూ.119.13 కోట్ల సాయాన్ని సీఎం జగనన్న అందజేశారు. విద్యాకానుక పథకం ద్వారా 31,060 మందికి రూ.15.32 కోట్లు ఖర్చు చేశారు. విద్యాదీవెన పథకం ద్వారా 24,256 మందికి రూ.34.12 కోట్లు.. వసతిదీవెన కింద రూ.23.58 కోట్లు, సంపూర్ణ పోషణకు రూ.39.77 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది.

మత్స్యకారులకు చేకూరిన లబ్ధి ..

వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద 2,944 మందికి రూ.10.70 కోట్ల సాయాన్ని ప్రభుత్వం అందించింది. 584 మంది లబ్ధిదారులకు ఆయిల్ సబ్సిడీ కింద రూ. 1.17 కోట్లు అందజేశారు. మరో ఏడుగురు మత్స్యకారులకు నష్టపరిహారం కింద రూ.40 లక్షలు మంజూరు చేసింది.

సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలు..

వైఎస్సార్ పింఛన్ కానుక కింద నాలుగేళ్లలో రూ.488.09 కోట్లు.. వైఎస్సార్ ఆసరా పథకానికి రూ.115.29 కోట్లు.. చేయూత పథకానికి రూ.108.99 కోట్లు.. అమ్మఒడి పథకానికి రూ.119.13 కోట్లు.. స్త్రీ నిధి ద్వారా రూ.92.38 కోట్లు.. చేదోడు కింద రజకులకు రూ.3.13 కోట్లు.. టైలర్లకు రూ. 2.78 కోట్లు.. నాయీ బ్రాహ్మణులకు రూ.1.02 కోట్లు.. జగనన్న తోడు పథకానికి రూ.9.32 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేసింది. 10,848 మంది ఇళ్ల లబ్ధిదారుల సొంతింటి కల నెరవేరింది. ఇలా చెప్పుకుంటూ పోతే మొత్తం 45 రకాల సంక్షేమ పథకాల ద్వారా కోట్లాది రూపాయలను ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం ఖర్చు చేసింది.


ఏనాడూ బెంగ పడలేదు..



జగన్‌బాబు ముఖ్యమంత్రి అయిన తర్వాత మాలాంటి ముసలోళ్లకు మంచి రోజులు వచ్చాయి. ఐదు సంవత్సరాల్లో ఒక్క రోజు కూడా పింఛన్ తీసుకోవడానికి బెంగ పడలేదు. గతంలో చేతికి సొమ్ము ఎప్పుడు వస్తుందోనని ఎదురు చూసేవాళ్లం. పంచాయతీ కార్యాలయాల వద్ద పడిగాపులు పడేవాళ్లం. ఇప్పుడు నేరుగా నా ఇంటి వద్దకే వచ్చి పింఛన్ సొమ్ము అందిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్న లక్షలాది మంది వృద్ధుల ఆశీర్వాదాలు జగన్ బాబుకు ఉంటాయి.

ధవళ రాములమ్మ, మొయిద విజయరామపురం గ్రామం

సొంతింటి భాగ్యం కలిగింది..



సీఎం జగనన్న దయవలన నాకు సొంతింటి భాగ్యం కలిగింది. సొంతిల్లు లేకపోవడంతో రోడ్డు పక్కన పూరిపాక వేసుకొని జీవనం సాగించే వాళ్లం. పేదలందరికీ ఇళ్లు పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఇంటి జాగా వచ్చింది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో ఇల్లు నిర్మించుకున్నాం.

మామిడిపాక రత్నకుమారి, రామతీర్థం

రైతు పక్షపాతి జగనన్న..



రైతుల పక్షపాతిగా జగనన్న నిరూపించుకున్నారు. రైతుభరోసా సొమ్మును ప్రతి ఏటా ఖాతాల్లో జమ చేసి చిత్తశుద్ధిని చాటుకున్నారు. గ్రామాల్లో రైతుభరోసా కేంద్రాలను అందుబాటులోకి తీసుకురావడంతో అవి మా రైతాంగానికి ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. సిబ్బంది ఎప్పటికప్పుడు మాకు సూచనలు, సలహాలు అందిస్తూ మమ్మల్ని ప్రోత్సహిస్తున్నారు.

మజ్జి చిన్నంనాయుడు, రైతు, సతివాడ

కోలగట్ల విజయానికి కృషి చేస్తాం..



కోలగట్ల వీరభద్రస్వామిని సత్కరిస్తున్న మైక్ అండ్ లైటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

- మైక్ అండ్ లైటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు

విజయనగరం: నిస్వార్థ సేవకుడు, నగరాభివృద్ధికి కారకుడైన స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి విజయానికి కృషి చేస్తామని మైక్ అండ్ లైటింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. ఈ మేరకు కోలగట్లను ఆయన నివాసంలో శుక్రవారం కలిసి సంఘీభావం తెలిపి, సత్కరించారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షుడు గాడు శ్రీనివాసరావు మాట్లాడుతూ..

ఐదేళ్లలో శాసనసభ్యుడిగా కోలగట్ల వీరభద్రస్వామి నగరాభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. అంతేకాకుండా తమ అసోసియేషన్ పరిధిలో 100 కుటుంబాలు పైబడి ఉన్నాయని.. వారందరికీ ఏ సమయంలో ఏ అవసరం వచ్చినా ఆయన అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు భిలాయి రాజు, కార్యదర్శి చిన్నరావు, తదితరులు పాల్గొన్నారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన సాధ్యం

- ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

పూసపాటిరేగ: సంక్షేమపాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని పతివాడ, తమ్మయ్యపాలెం, రాయుడుపేట, పతివాడబర్రిపేట, చినపతివాడ గ్రామాలలో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబుతో కలిసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలు బడ్డుకొండ, పెనుమత్స, తదితరులకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ హయాంలో చేసిన అభివృద్ధి, అందించిన సంక్షేమాన్ని వివరించారు. బడ్డుకొండ అప్పలనాయుడు మాట్లాడుతూ.. కుల, మత రాజకీయాలకు అతీతంగా ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతోందన్నారు. 2019 ఎన్నికలలో ఇచ్చిన హామీలను వందశాతం అమలు చేశారని తెలిపారు. డీబీటీ పద్ధతిలో 130 సార్లు బటన్ నొక్కి రూ. 2.75 లక్షల కోట్లు పేద ప్రజలకు నేరుగా అందించారని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసినా, ఒక్క సంక్షేమ పథకం పక్కాగా అమలు చేయలేదని ఆరోపించారు. అలాగే ప్రజలను కల్లబొల్లి మాటలతో మోసం చేశారన్నారు. ఒక్క జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడానికి మూడు పార్టీలు ఏకం కావాల్సి వచ్చిందన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలను మోసగించడానికి వస్తున్న మూడు పార్టీలకు గట్టిగా బుద్ధి చెప్పి.. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మాత్రం ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, ఎంపీపీ మహంతి కల్యాణి, జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, అల్లాడ రమేష్, దాడిశెట్టి త్రినాథరావు, పట్టిపు శ్రీనివాసరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, డి. ఈశ్వరరావు, పిన్నింటి నారాయణరావు, పతివాడ సత్యం, తదితరులు పాల్గొన్నారు.



పతివాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ సురేష్‌బాబు, తదితరులు

కూటమి అభ్యర్థులకు గుణపాఠం చెబుతాం..



సమావేశంలో మాట్లాడుతున్న కొప్పలవెలమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరావు

- కొప్పల వెలమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతిరావు

విజయనగరం ఫోర్ట్: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థులకు తగిన గుణపాఠం చెబుతామని కొప్పల వెలమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినాయిని తిరుపతిరావు హెచ్చరించారు. నగరంలోని ప్రదీప్‌నగర్‌లో గల సంఘ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, విజయనగరం పార్లమెంట్ పరిధిలో ఒక్క అసెంబ్లీ సీటు కూడా కొప్పల వెలమలకు కూటమి తరఫున కేటాయించలేదన్నారు. బొబ్బిలి, విజయనగరం రెండు సీట్లనూ ఓసీ వర్గాలకు కేటాయించారని మండిపడ్డారు. జనాభా ప్రాతిపదికన గజపతినగరం అసెంబ్లీ స్థానం, విజయనగరం ఎంపీ స్థానాన్ని కొప్పల వెలమలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. బొబ్బిలి నియోజకవర్గంలో లక్షా 10 వేల మంది.. గజపతినగరం నియోజకవర్గంలో లక్ష మంది కొప్పల వెలమలు ఉన్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ కొప్పల వెలమలకు బొబ్బిలి ఎమ్మెల్యే సీట్, అనకాపల్లి ఎంపీ స్థానాన్ని కేటాయించి తగిన ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. ఏడు నియోజకవర్గాల పరిధిలో 5 లక్షల మంది కొప్పల వెలమలు ఉన్నారని.. ఓటు ద్వారా కూటమి అభ్యర్థులకు తమ సత్తా ఏమిటో చూపిస్తామని స్పష్టం చేశారు. మరిశర్ల కృష్ణమూర్తినాయుడు మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ మినహా మిగిలిన రాజకీయ పార్టీలు కొప్పల వెలమలను తొక్కేస్తున్నాయని ఆరోపించారు. సమావేశంలో కొప్పలవెలమ సంఘ ప్రతినిధులు దొగ్గ దేముడుబాబు, మరిశర్ల కన్నంనాయుడు, అల్లు సత్యం, బోని చంద్రునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్

చీపురుపల్లి: ఐదేళ్ల పరిపాలనలో సంక్షేమ పథకాలు అమలు చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ కోరారు. మండలంలోని పేరిపి, రావివలస, ఇటకర్లపల్లి, పర్ల పంచాయతీలతో పాటు చీపురుపల్లి మేజర్ పంచాయతీ పరిధిలోని రెండవ ఎంపీటీసీ ప్రాంతంలో శుక్రవారం ప్రచారం నిర్వహించిన అనంతరం జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష నివాసం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ శిరీషతో పాటు మహిళలు విజయ తిలకం దిద్ది హారతులు పట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ పథకం అందించిన ఏకైక ప్రభుత్వం జగన్ మోహన్‌రెడ్డిదేనన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా పథకాలు అమలు జరిగాయన్నారు. అభివృద్ధి విషయంలో కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందన్నారు. కూటమి పేరుతో వచ్చే మోసగాళ్లను నమ్మొద్దని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.



పర్ల గ్రామంలో ఎంపీ బెల్లానకు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సీతారామునిపేట రూరల్ ఫీడర్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శనివారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం నాలుగు వరకు విద్యుత్ సరఫరా ఉండదని డీఈఈ పూడి హరి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫీడర్ పరిధిలోని సీతారామునిపేట, గొర్లిపేట, కొత్తపేట, దీపిల్లిపేట, తుమ్మలపేట, జగ్గరాజుపేట, దన్నానపేట, కోరాడపేట, ఏటీ అగ్రహారం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు ఉచిత శిక్షణ

కొత్తవలస: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరు కానున్న విద్యార్థుల కోసం మండల కేంద్రంలో గల భారత్ డిఫెన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిం చనున్నట్లు తెలిపారు. ప్రతీ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు తరగతులను నిర్వహిస్తామన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 99854 12929, 83310 00746 నంబర్లను సంప్రదించాలన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు

వేపాడ: మండలంలోని నాలుగు గ్రామాల్లో ఎస్.కోట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలు శుక్రవారం కవాతు నిర్వహించాయి. బొద్దాం, పాటూరు, సోంపురం, అరిగిపాలెం గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించిన సందర్భంగా సీఐ మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి హింసాత్మక సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులకు అందరూ సహకరించాలని కోరారు. వల్లంపూడి ఎస్ఐ రాజేష్ నేతృత్వంలో నిర్వహించిన కవాతులో పోలీసులు, కేంద్ర బలగాలు సుమారు 70 మంది పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి..

విజయనగరం ఫూల్‌బాగ్: అటవీ ప్రాంతంలో వేసవికాలంలో సంభవించే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా అటవీ అధికారి ఎస్. వెంకటేష్ అన్నారు. శుక్రవారం స్థానిక ఫూల్‌బాగ్‌లోని అటవీశాఖ జిల్లా కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అటవీ భూమి ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా బడ్జెట్, ఖర్చులు, వచ్చే ఏడాదికి సంబంధించిన ప్రణాళికలపై చర్చించారు. జేతనాపల్లిలో నిర్మిస్తున్న నగర వనం పనులపై సమీక్షించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు బి. అప్పలరాజు, త్రినాథరావు, ఆర్. రాజశేఖర్‌బాబు, సింధు, డీఆర్‌ఓ కేపీఎస్ రాజు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ వెంకటేష్

రాష్ట్ర భవిష్యత్ కోసం జగన్‌ను సీఎం చేయాలి



వంగర గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య

- ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, ఎమ్మెల్సీ సురేష్‌బాబు

దత్తిరాజేరు: రాష్ట్ర భవిష్యత్ కోసం జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రి చేయాలని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. వింధ్యవాసి, వంగర గ్రామాల్లో ఎమ్మెల్సీ పెనుమత్స సురేష్‌బాబుతో కలసి శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలను మహారాణులను చేయాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలు వారి పేరిట మంజూరు చేస్తున్న ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. పేద, మధ్య తరగతి పిల్లల భవిష్యత్ కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ రావాల్సిన అవసరం ఉందన్నారు. కూటమి పేరుతో వస్తున్న ప్రతిపక్షాలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వలంటీరు వ్యవస్థ ద్వారా ఇంటికే సంక్షేమ ఫలాలు అందిస్తున్నామన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామాల్లోనే ప్రజల సమస్యలు పరిష్కరించబడుతున్నాయన్నారు. పీటన్నింటిని గుర్తించి ప్రజలు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని కోరారు. టీడీపీ కూటమిని ఇంటికి పంపించాలన్నారు. ప్రచారంలో ఎమ్మెల్యే కుమారుడు గురునాయుడు, వింధ్యవాసి, వంగర సర్పంచ్‌లు రంభ చంద్రశేఖర్, దత్తి నారాయణప్పలనాయుడు, మండల యువజన విభాగం అధ్యక్షుడు దత్తి చిరంజీవి, ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి, వైస్ ఎంపీపీలు బమ్మిడి అప్పలనాయుడు, మిత్తిరెడ్డి రమేష్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మంత్రి అప్పలనాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు రాపాక కృష్ణమూర్తి, జేసీఎస్ కన్వీనర్ ఫణీంద్రుడు తదితరులు పాల్గొన్నారు.